



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :57 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం బుధవారం 11 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 57 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM WED 11 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్-టాంవీవీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం

మిగతా 2లో



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. ఆలయాలపై దాడులు అంటూ

మిగతా 2లో



## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:** వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో

## జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు



- గుండ్లపాడు జంట హత్యల కేసు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు
- కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం
- గతేడాది జరిగిన ఈ హత్యల కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న వెంకట్రామిరెడ్డి
- కోర్టు తీర్పుతో జైలులోనే కొనసాగనున్న వైసీపీ నేత


మిగతా 2లో

## బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులతో పాటు క్రీడలు, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- నీరుకొండలో భారీ టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశం
- సచివాలయం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

### చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు

- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- చైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో



## ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

### మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు

- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో





## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెం ట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ

మిగతా 2లో

## ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

### లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# పొగతో మసకబారుతున్న బతుకులు

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాథలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది. "పొగకు స్వస్తి పలుకుదాం – కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. "గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి" అని సూచించారు. ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు**

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది.

వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్లకు, రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

**డీజీసీఏ వైఫల్యం**

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది.

ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని విమర్శలు వచ్చాయి.

**ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది.

డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ఎ అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- మొదటి పేజి తరువాయి

మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భారతి సిమెంట్‌కు రూ.165 కోట్ల లబ్ధి**

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

**ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం**

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ–7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్థ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- మొదటి పేజి తరువాయి

పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనలో దూసుకుపోతున్న సాధక్ లందరికి శుభాభినందనలు

**రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 10:** నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సాధక్‌లు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ ఉత్సాహంగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ మరియు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య సాధక్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.సభ్యత్వ నమోదు, కొత్త తరం నాయకులను తయారు చేయడం, నవ సమాజ నిర్మాణంలో చొరవ చూపించడం ద్వారా స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.జరుగుతున్న సభ్యత్వ నమోదు కోసం సాధకులు మరింత చురుగ్గా, సమగ్రంగా పనిచేయాలని, ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం ।అనకాపల్లి। అల్లూరి జిల్లా

# వడగాల్పులపై అప్రమత్తంగా ఉండాలి




* 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026' ఆవిష్కరణ

**విశాఖ, పెన్ పవర్, మార్చి 10 :**రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టి లో ఉంచుకొని వడదెబ్బల వల్ల ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని రాష్ట్ర హోం మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది రాష్ట్రం లో "జీరో హ్యూమన్ అండ్ యానిమల్ లాస్" లక్ష్యంగా పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు.

మంగళవారం తాడేపల్లిలోని ఏపీఎస్డీఎంఏ కార్యాలయంలో కలెక్టర్లు, వివిధ శాఖల అధికా రులు, విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధులతో ఎండ తీవ్రత, వడగాల్పులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026'ను ఆవిష్కరించా రు.వేసవి కాలంలో వడగాల్పుల హెచ్చరికలను విపత్తు నిర్వహణ సంస్థ మరియు ఆర్టీజీఎస్ ద్వారా అందుబాటులోకి తెచ్చి ప్రజలకు వెంటనే చేరవేయాలని కలెక్టర్లకు సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బహిరంగ పనులను నిలిపివేసి, పనివేళలను పునర్వ్యవ స్థీకరించాలని తెలిపారు. ముఖ్యంగా కార్మికు లు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

వడదెబ్బ బాధితులకు ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలు, అవసరమైన మందులు, అంబులెన్సు లు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖకు ఆదేశించారు. బస్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎన్జీవోలు, కమ్యూనిటీ సంస్థల సహకారంతో మజ్జిగ, తాగు నీరు పంపిణీ చేయాలని సూచించారు.

ఎండల ప్రభావం పశువులపై పడకుండా గ్రామా ల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నింపాలని, పశుగ్రాసం విషయంలో రైతులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని తెలిపారు. గృహ అవస రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగ కుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, నీటి కుంటల వద్ద ఆడుకునే సమ యంలో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఫైర్ డిపార్టుమెంట్ ఆసుపత్రులు, హోటళ్లు, ప్రైవేటు భవనాల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు, వైరింగ్ తదితర అంశాలను తనిఖీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఎండ తీవ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అలాగే విపత్తు నిర్వహణ సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మా ట్లాడుతూ సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాం తాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు గత వేసవి అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

సమీక్ష సమావేశంలో ఎస్డీఆర్ఎఫ్ ఐజీపీ రాజ కుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఫైర్ డిపార్టుమెంట్ అదనపు డైరెక్టర్ జ్ఞానసుందర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాల నుంచి కలెక్టర్లు, డిఆర్వోలు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు.

## అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.

* గిరిజన ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం
* భద్రగిరి సీహెచ్సీ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



**గుమ్మలక్ష్మీపురం, మార్చి 10 పెన్ పవర్.**ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గిరిజన పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జేసీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన,రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి చేరుకున్న జేసీ ముందుగా సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేస్తు విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా,సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు.ఇన్‌పేషెంట్ వార్డులను సందర్శించి,చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు.వారికి అందుతున్న ఆహారం, మందులు మరియు వైద్యుల సేవల గురించి అడిగితెలుసుకున్నారు.ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపరచాలని,తాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఫార్మసీని తనిఖీ చేసి,అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.గిరిజన ప్రాంతం కావడంతో అత్యవసర మందులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారులు,ఆసుపత్రి సిబ్బంది మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డలో గిరిజనుడు గల్లంతు

* నాటు పడవతో గాలింపు చర్యలు చేపట్టిన లభ్యం కానీ మృతదేహం.
* ఓ గిరిజనుడు మత్స్యగెడ్డలో గల్లంతైన పట్టించుకొని మండల స్థాయి అధికారులు.
* అధికారుల నిర్లక్ష్యంపై ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర ఆగ్రహం.
* మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన చైర్పర్సన్ సుభద్ర.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి10.**మండలంలో గల సుజనకోట పంచాయతీ, కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డలో కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన వంతాల గోపీనాథ్(58) అనే గిరిజనుడు గల్లంతయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో అరటికాయలు కోసుకుని మండల కేంద్రానికి తీసుకువచ్చి వ్యాపారాస్తులకు అమ్మి తిరిగి స్వగ్రామమైన వెళ్లే క్రమంలో మత్స్యగెడ్డలో స్నానం చేసి బోటు దాటి ఇంటికి వెళ్లాలని స్నానానికి దిగి కాలు జారి గెడ్డలో గల్లంతయ్యాడు. బయట గోపీనాథ్ పట్టు కొచ్చిన సంచి ఉండడంతో గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు విషయం తెలియ జేయడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు బంధుమిత్రులు నాటు పడవతో మంగళవారం ఉదయం నుండి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మత్స్యగెడ్డలో గల్లంతైన విషయం ముంచంగిపుట్టు పోలీసులకు సమాచారం కుటుంబ సభ్యులు అందజేశారు. కుమ్మరిపుట్టు మత్స్య గెడ్డలో గిరిజనుడు గల్లంతు అయిన విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర కుమ్మరిపుట్టు గ్రామానికి చేరుకొని కుటుంబాన్ని పరామర్శించి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మండల అధికారుల తీరుపై చైర్పర్సన్ వస్తేనే మండల స్థాయి అధికారులు వస్తారా అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల తహసిల్దార్ కు ఫోన్ చేస్తే గాని కుమ్మరిపుట్ గ్రామానికి సాయంకాలానికి ఆలస్యంగా చేరుకోవటం ఏమిటని ఆమె అసహనం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులు దగ్గర ఉండి గాలింపుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె మండల తహసిల్దార్ భాస్కర్ అప్పారావుకు ఆదేశించారు. మంగళవారం చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలుపుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంగడ రమేష్, వైసీపీ నేత జెవిఎన్ మూర్తి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, వైసీపీ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పేద వర్గాలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం

* ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం
* రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం / నిమ్మాడ. మార్చి10 :** రాజకీయాలకు అతీతంగా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు 9 మంది లబ్ధిదారులకు రూ. ఏడు లక్షల 50 వేలు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధి దారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సహాయం పొందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.



లబ్ధిదారుల వివరాలు

బి,వరదరాజు, 77,090, మండలం కోటబొమ్మాళి, చిన్నసాన, పి.మల్లేశ్వరరావు, కోటబొమ్మాళి మండలం, రూ, 51.245, కె.అప్పారావు, కోటబొమ్మాళి, పట్టుపురం, రూ,32,551 టి,సింహబాలుడు, కోటబొమ్మాళి, తాటిపత్రి, నీటవేణ నందిగాం మండలం కొత్తపేట, 41,729. ఎన్. శ్రీరాములు, సంతబోమ్మాళి వడ్డివాడ, రూ. 31,843 కె.సర్వతి, పుక్కలవానిపేట, రూ. 60,848, ఎల్,శ్రీనివాసరావు, వద్దవాడ, సంతబొమ్మాళి, బృందావనం 1,12,141, చెక్కులు అందజేశారు.

## గిరిజన రైతులకు వేపపిండి పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి





**కురుపాం, పెన్ పవర్,మార్చి 10 :** పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం గిరిజన రైతులకు వేపపిండి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఐటిడిఏ పార్వతీపురం సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

ఎస్ సి ఏ టు టి ఎస్ ఎస్ 201819 నిధులతో 100 శాతం రాయితీపై గిరిజన రైతులకు వేపపిండి పంపిణీ చేయగా, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించి రైతులకు వేపపిండి అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. అలాగే పంటల ఉత్పత్తి పెంపుకు అవసరమైన సూక్ష్మ పోషకాలు అయిన జింక్, జిప్సం, బోరన్ వినియోగంపై కూడా వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులు, వేపపిండి వంటి ప్రకృతి సహజ ఉత్పత్తులను వినియోగించడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు శంకర్రావు, నాగేశ్వరావు, ప్రజాప్రతినిధులు జిల్లా గ్రంధాలయ చైర్మన్ దొంకాడ రామకృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి, మాజీ ఏయంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఆరిక జానకి, లంక గోపాలం, సోములు మాష్టారు, గిరిజన రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి.

✷ అదనపు ఎస్పీ కె.వి. రమణ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 10:** వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని, వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలని అదనపు ఎస్పీ కె.వి. రమణ అన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు 14 రోజుల పాటు నిర్వహించిన పునశ్చరణ శిక్షణ (మొబిలైజేషన్) ముగింపు కార్యక్రమం మంగళవారం ఉదయం తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం పరేడ్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ కె.వి. రమణ హాజరయ్యారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు రోజూ నిర్వహించే వివిధ విధులు, ఆయుధాల వినియోగం వంటి అంశాలను ఈ మొబిలైజేషన్ శిక్షణలో భాగంగా పునశ్చరణ చేయడంతో పాటు వాటికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా జోడించామని అదనపు ఎస్పీ తెలిపారు.

జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం ఎంతో ముఖ్యమైనదని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖకు వెన్నుముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు ప్రతిరోజూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తగిన ఆహారం తీసుకుంటూ శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు.ఈ మొబిలైజేషన్ (పునశ్చరణ) శిక్షణలో వీఐపీల భద్రత, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్, వ్యక్తిత్వ వికాసం, మస్కట్రీ డ్రిల్, మెడికల్ అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం, రయట్ గేర్ ఆపరేషన్, యోగ, శారీరక దారుఢ్య పరీక్షలు వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకుని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శేషాద్రి, గోవిందరావు, ఆర్ఐ శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు మరియు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పై దృష్టి సారించండి.భీశెట్టి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 10 :** విజయనగరం జిల్లాలో అత్యంత కీలకమైన రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సీ.హెచ్.సత్తిబాబుని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఇటీవల జిల్లా డీఆర్వో బాధ్యతలు స్వీకరించిన సత్తిబాబుని మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాలోని అన్ని మండల స్థాయిలోని ప్రతి చిన్న రెవెన్యూ సమస్యలకి ప్రజలు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పరిపాలనలో రాజకీయ జోక్యం పెరగటంతో ప్రజలు మరీ ఇబ్బందులు పడుతున్నారని జిల్లా డీఆర్వోగా ప్రజా సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కొంతమంది రెవెన్యూ అధికారులు చేసిన తప్పులకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని సరిదిదేందుకు తగిన తీసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గ స్థాయిలోను రెవెన్యూ క్లినిక్ లు ఏర్పాటు చెయ్యాలని భీశెట్టి డీఆర్వో సత్తిబాబు ని కోరారు.

## ప్రజాసమస్యలపై మండలిలో సురేష్ గళం విప్పారు.

### -ఎమ్మెల్సీ సురేష్ ని సత్కరించిన పౌరవేదిక ప్రతినిధులు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 10 :** రాష్ట్ర శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ విజయనగరం జిల్లాలో అత్యంత కీలకమైన ప్రజా సమస్యలపై గళం విప్పి ప్రజల మన్ననలు పొందారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మంగళవారం పౌర వేదిక బృందంతో జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో ఎమ్మెల్సీ సురేష్ ని ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో క్యాన్సర్ భారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యంగా మహిళలు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ లతో పడుతున్న అవస్థలు ఒక డాక్టర్ గా ఎమ్మెల్సీ సురేష్ అర్థం చేసుకుని మాట్లాడారని, విజయనగరం జిల్లాలో వెంటనే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ని ఏర్పాటు చేయాలని దాని అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరలించాలని కోరారని భీశెట్టి అన్నారు, జిల్లాలో అత్యంత కీలకమైన సమస్యలు త్రాగునీరు, సాగునీరు, మూత పడ్డ భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ, యువతకి ఉపాధి లేని పరిస్థితి రైతు సమస్యలపై అధికార పార్టీ నేతలు శాసన సభలో మాట్లాడకపోవడం తమకు బాధ కలిగిందని భీశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో పౌర వేదిక నేతలు జలంత్రి రామచంద్ర రాజు,దవడ కొండబాబు, పట్నాల శ్రీనివాస్, అల్లంశెట్టి నాగభూషణం, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 10 :** ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. జియ్యమ్మవలస మండలంలోని రామభద్రపురం మరియు కొమరాడ మండలంలోని మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జేసీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలనను పాటించాలని, విధులకు గైర్హాజరు అయితే చర్యలు తప్పవని జాయింట్ కలక్టర్ వైద్య సిబ్బందికి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు, శిశు మరణాల నివారణ చర్యలు మరియు వ్యాక్సినేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు మరియు పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జేసీ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ఈ తనిఖీల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, సంబంధిత మండల తహశీల్దార్లు, వైద్యాధికారులు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే వేసవి దృష్ట్యా వడగాల్పుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

### అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదేశం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 10 :** రాబోయే వేసవి(మార్చి–మే)లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, జిల్లా అధికారులు ముందస్తు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అలాగే పిడుగుల బారి నుండి రక్షణపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు 'వడగాల్పుల నివారణ కార్యాచరణ ప్రణాళిక – 2026' అమలుపై రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, పంచాయతీ, గ్రామ, వార్డు మరియు మున్సిపల్ స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వడగాల్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిడుగుల బారి నుండి రక్షణపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పేర్కొన్నారు. మండలాల వారీగా ఉష్ణోగ్రత సూచీ మరియు గరిష్ట ఉష్ణోగ్రతలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు చేరవేయడం జరుగుతుందన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు కలిగిన కరపత్రాలు మరియు ఐ.ఇ.సి మెటీరియల్ ద్వారా ప్రజలను చైతన్య పరచాలన్నారు. పశుగ్రాసం మరియు పశువుల ఆరోగ్యం విషయంలో కూడా జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు.

వడగాల్పులు మరియు పిడుగుల బారి నుండి రక్షణ కొరకు సమన్వయ కమిటీలను ఏర్పాటుచేసుకోవాలని, వేసవి పరిస్థితులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. ప్రతిరోజూ నివేదికలను విపత్తు నిర్వహణ సంస్థకు పంపాలని ఆదేశించారు.



మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని, తగినంత నీరు మరియు ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల ప్రాణనష్టం జరగకుండా, ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే రోజుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, డీసీహెచ్ఎస్, డిఎంహెచ్ఓ, డిఆర్డిఏ, డ్వామా, మెప్మా, డీపీఓ, పశు సంవర్ధక శాఖ, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కురుపాం పాఠశాలకు బీరువా వితరణ

**కురుపాం, పెన్ పవర్, మార్చి 10 :** కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పట్నాన వెంకట దుర్గా ప్రసాద రావు పాఠశాలకు రికార్డులు భద్రపరుచుకొనేందుకు బీరువా అందజేశారు. 1982-83 పదవ తరగతి విద్యార్థయిన దుర్గా ప్రసాద్ మంగళవారం ప్రధానోపాధ్యాయులు తోట శంకర రావు కి బీరువా అందజేశారు. భవిష్యత్ లో కూడా పాఠశాలకు సహకరిస్తానని ఆయన తెలియజేసారు.



## భగీరథ పార్కుకు శంకుస్థాపన

✷ ఎమ్మెల్యే చొరవతో సగరుల కల సాకారం



**గాజువాక: పెన్ పవర్ ,మార్చి 10** సగరుల సామాజిక వర్గానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భగీరథ పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి శంకుస్థాపన చేశారు.జీవీఎంసి 71 వ వార్డు,దుర్గానగర్ వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహం ప్రాంగణంలో సుమారు 48.50 లక్షల వ్యయంతో రూపాయలతో అత్యాధునిక పార్క్,ప్రహరీ ఏర్పాటుకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.విగ్రహం ఏర్పాటు సమయంలో తానిచ్చిన మాటకు కట్టుబడి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.సగరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.అంతకు ముందు భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు,జనసేన నాయకులు కరణం కనకారావు,ఆకుల అప్పల సూరి,సీనియర్ నాయకులు రొంగలి లక్ష్మీనాయుడు,వార్డు అధ్యక్ష కార్యదర్శులు బొడ్డేడ నాయుడు,రామచంద్రరావు,నక్క లక్ష్మణరావు,క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాస్,గుర్రం నూకరాజు,సూర్యనారాయణ, గుర్రాల దేవుడు,బద్దేటి గోవింద, వాసుదేవరెడ్డి,లోవరాజు,చల్లా చందు,పప్పు రాజారావు,కుమారి, దేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పోలమాంబ అమ్మవారి దేవస్థానానికి

✷ నూతన ఈఓగా టి. రాజగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకారం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 10 :**దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉ న్న శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థా నానికి నూతన కార్యనిర్వహణాధికారిగా (ఈఓ) ఈఓ గ్రేడ్1 అధికారి టి. రాజగోపాల్ రెడ్డి మం గళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యత లు చేపట్టిన అనంతరం ఆలయంలో అమ్మవారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించా రు.ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగ వంతంగా కొనసాగించడంతో పాటు భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. దేవస్థానం పరిపా లన పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుం టామని కూడా వెల్లడించారు.అనంతరం దేవ స్థానం చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు మరియు దేవస్థాన సిబ్బంది నూతన ఈఓ టి. రాజగోపాల్ రెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


ఈ కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంతాన లక్ష్మి దీవెనలు ప్రజలందరి పైన ఉండాలి జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షులు వలిరెడ్డి.

**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 10** చీపురుపల్లి పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీ శ్రీ శ్రీ శీతలాదేవి (సంతాన లక్ష్మి) అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరూ పైన ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు ఆకాంక్షించారు. మంగళవారం నాడు42 వ జాతర సందర్భంగా నిర్వాహకులు ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు రేవల్ల సత్తిబాబు, కర్రోతు ప్రసాద్, ప్రభాత్ కుమార్, ప్రముఖ వ్యాపార వేత్త అందవరపు గోవింద, రేవల్ల సత్యం, రామ గురువులు, డబ్బాడ ఆనంద్, వెంకీ, చక్రి, తో కలిసి అమ్మవారికి ఆలయ అర్చకులుతో ప్రత్యేక పూజలు చేసిన అంతర ఆలయ కమిటీ వారు కండువా వేసి సత్కరించారు, అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ(సంతాన లక్ష్మి) అమ్మవారు మహిమగల అమ్మవారు అని కోరన కోరికలు తీర్చే చల్లని తల్లి అని అన్నారు. సంతాన లక్ష్మి దేవతను ఇతర లక్ష్మీ అవతారాల కంటే చాలా భిన్నంగా చిత్రీకరించారు అన్నారు. సంతాన లక్ష్మీ స్తోత్రాన్ని స్వచ్ఛమైన హృదయంతో జపించడం ద్వారా, దేవతను సులభంగా శాంతింపజేసి దేవత అనుగ్రహాన్ని పొందవచ్చు అన్నారు.

సంతాన లక్ష్మి అమ్మవారు దయ కరుణ కటాక్షం చల్లని దీవెనలు ప్రజలు అందరి పై ఉండాలని కోరుకొన్నారు అని అన్నారు.






## మన్యం గోబాల సంబరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..





**కురుపాం, పెన్ పవర్, మార్చి 10 :** కురుపాం మండలం గుమ్మ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మన్యం గోబాల సంబరం (లేగదూడల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యులు తోయక జగదీశ్వరి హాజరై లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పశుసంవర్ధక శాఖ నుంచి లభించే ఆర్థిక వనరులను పెంపొందించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే మెరుగైన జాతి పశువుల అభివృద్ధి కోసం లింగ నిర్ధారిత ఇంజెక్షన్‌ను కేవలం రూ.150కే అందుబాటులో ఉంచామని, ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎస్. మన్మధరావు మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నదని, అలాగే పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి పాడి రైతు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లేగదూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు. అలాగే పశు బీమా నష్టపరిహారం చెక్కులను రైతులకు అందజేసి, సబ్సిడీ దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు, శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గావు పండగ.



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 10 .** చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో మంగళవారం నాడు యాదవ కులస్తుల కులదైవమైన అమ్మవారిని దర్శించుకుంటూ సుమారు 70 కుటుంబాలు వారు గావు పండగను ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తుల పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు బంధువులతో రాయవలస గ్రామం కిటకిటలాడింది. ప్రత్యేకించి అమ్మవారి పూజలలో భాగంగా తప్పుడు గుళ్ళు ఇతర కార్యక్రమాలు నిర్వహణతో పాటు పూజలు కూడా ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా జరిపిన ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలతో పాటు బంద్ వర్గాలు పాల్గొని గావు పండగను విజయవంతం చేశారు.

# దక్షిణంలో అభివృద్ధి పనులు వేగవంతం





- 39 వ వార్డులో రూ.98.40 లక్షల
- తారు రోడ్డు పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శ్రీకారం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 10 :**నగరంలోని 39 వ వార్డులో పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ నుంచి తారకరామ బస్ స్టాప్ వరకు చేప ట్టనున్న తారు రోడ్డు పునరుద్ధరణ పను లకు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శంకుస్థా పన చేశారు. స్థానిక కార్పొరేటర్ సాదిక్‌తో కలిసి ఆయన పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.98.40 లక్షల వ్యయంతో చేపట్టబోయే ఈ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మె ల్యే ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ నియో జకవర్గంలో ఎన్న డూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొన సాగుతున్నాయని తెలిపారు. అన్ని వార్డుల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సదు పాయాలు, విద్యుత్ సరఫరా, గృహ నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృ ద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి ఫలాలు అందుతు న్నాయని ఆయన పేర్కొన్నారు. నగర ప్రజలు పాత నగర ప్రాంతాల అభివృద్ధిని గమ నించే స్థాయికి మార్పులు తీసుకువచ్చామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకు డు అత్తిలి శంకరరావు, మాజీ ఎస్‌కేఎం ఎల్ చైర్మన్ కొల్లి సింహాచలం, తాతారావు, హీరా, కోటమ్మ, బిగ్‌బాస్ తదితరులు పాల్గొ న్నారు. అలాగే ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ షమీం తదితర ప్రభుత్వ అధికారులు మరియు కూటమి నాయకులు హాజరయ్యారు. అనంత రం పాత పోస్ట్ ఆఫీస్ వద్ద స్థానిక కార్పొరేటర్ సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్య కర్తలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కూట మి నాయకులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 10.** ఇంటి యజమాని నిర్లక్ష్యం కారణంగా చీపురుపల్లి పట్టణంలో మంగళవారం నాడు జరిగిన ప్రమాదంలో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. చీపురుపల్లి పట్టణంలోని మెట్ట కాలనీలో నివాసముంటున్న బూర గంగులు ( 35) అనే రోజువారి కూలీ కుటుంబం పోషణ కోసం యధావిధిగా మంగళవారం నాడు కూలి పనికి వెళ్ళాడు. పట్టణానికి చెందిన సూరు జగన్మోహన్రావు అనే ఇంటి యజమాని పాత ఇంటి పనులు జరిపిస్తున్న నేపథ్యంలో కూలీగా అక్కడ పనిచేస్తుండగా అకస్మాత్తుగా గోడకూలి గంగులు అక్కడికక్కడే మృతి చెందాడు. పాత ఇంటి గోడలు తొలగిస్తే నేపథ్యంలో సంబంధిత యజమాని కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం వలన ప్రమాదం జరిగి పో నిండు ప్రాణం బలి కావలసి వచ్చింది అంటూ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మృతుడు గంగులకి భార్య భాగ్యలక్ష్మి తో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లాడు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన మృతుడు ఐదేళ్ల క్రితం జీవనోపాధి కొరకు చీపురుపల్లి పట్టణంలోని మెట్ట కాలనీ చేరుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. రోజువారీ కూలి బ్రతుకుతూ జీవనం కొనసాగిస్తున్న తమకు ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందంటూ మృతునికి బంధువులు రోదిస్తున్నారు. పాత ఇంటి నిర్మాణం తొలగించి కొత్త పనులు చేపడుతున్న నేపథ్యంలో తీసుకోవలసిన కనీస రక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. సంబంధిత పంచాయతీ అధికారుల నుండి కూడా అనుమతులు లేకుండానే ఇంటి నిర్మాణం పనులు చేపట్టడం వలన ప్రమాదం సంబంధించిందని పలువురు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం స్థానిక అధికార పార్టీ నాయకులు కొంతమంది బాధిత కుటుంబంతోపాటు ఇంటి యజమానితో చర్చలు జరిపే ప్రయత్నం చేశారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ వద్ద చర్చలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులు కి ఇంటి యాజమాన్యం లకు వాగ్వేదం జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చీపురుపల్లి ఎస్సై సిబ్బందితో చేరుకుని సెటిల్మెంట్లు బయట చేసుకోండి బాధితులు తరపున కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితుల తరపున వచ్చిన గ్రామస్తులంతా సద్దుమణి గారు. నేపద్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చీపురుపల్లి పోలీసులు వివరించారు.ఇప్పటికైనా బాధిత కుటుంబానికి న్యాయం జరపాలంటూ పలువురు కోరుతున్నారు...

# రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 10**:రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే పంపిణీదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జీకే వీధి మండల తహశీల్దార్ హెచ్.అన్నాజీ రావు హెచ్చరించారు. మండలంలోని మొండిగడ్డ గ్రామ రేషన్ దుకాణాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ సరుకుల పంపిణీ విధానం, స్టాక్ వివరాలు పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా అర్హులైన ప్రతి కార్డుదారునికి రేషన్ సరుకులు అందేలా పంపిణీ పూర్తి చేయాలని డిపో నిర్వాహకులకు సూచించారు. అనంతరం మొండిగడ్డ గ్రామంలో రెవెన్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. గ్రామస్థులు సమర్పించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలు, ఇంకా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సమీక్షించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి సేకరిస్తున్న ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సానుకూల స్పందన ఇవ్వాలంటే అధికారులు,సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ, మండల సర్వేయర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

- 13 కోట్లరూపాయలు తో చేపట్టే పనులకు ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన





**గాజువాక:పెన్ పవర్ . మార్చి 10** పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజక వర్గం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని స్థానిక శాసన సభ్యుడు,రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు.గాజువాక వంటిల్లు కూడలి నుంచి జగ్గు సెంటర్ వరకు సుమారు 13 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ,ఆధునికీకరణ,డ్రైనేజీ పనులకు 72,73 వార్డుల కార్పొరేటర్లు ఏజె.స్టాలిన్,భూపతి రాజు సుజాతలతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 230 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ 1 గా తీర్చి దిద్దుతామని అన్నారు.అన్ని వార్డుల్లోనూ మౌలిక సౌకర్యాలకు పెద్ద పీట వేశామని తెలిపారు.పార్కులు,క్రీడా ప్రాంగణాలు,సామాజిక భవనాలు,కళ్యాణ మండపాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు,రాజాన రామారావు గంధం శ్రీనివాస రావు,డిసిసిబి చైర్మన్ కోన తాతారావు,టిడిపి రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయ్ కుమార్,బిజెపి కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు,జనసేన నాయకుడు కరణం కనకారావు,బలగ బాలు నాయుడు, సింగూరు అనంత్, విజయ్ కుమార్,సిపిఐ నాయకులు అప్పారి విష్ణు మూర్తి, డివి సత్యారావు తదితరులు పాల్గొన్నారు

## అరకులోయలో దివ్యాంగులకు చెవి వినికిడి పరికరాల పంపిణీ.



**అరకులోయ పెన్ పవర్ 10:**అరకులోయ మండలంలోని దివ్యాంగుల సంక్షేమం కోసం ట్రైబల్ డిసబుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ట్రైబల్ డిసబుల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెవి వినికిడి సమస్యలు ఉన్న దివ్యాంగులకు చెవి వినికిడి యంత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ట్రైబల్ డిసబుల్ హెల్పర్ సొసైటీ అధ్యక్షుడు బి.బి. ధర్మ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవి వినిపించని వారు లేదా వినికిడి సమస్యలు ఉన్న దివ్యాంగులు ట్రైబల్ డిసబుల్ హెల్పర్ సొసైటీకి దరఖాస్తు చేసుకుంటే అవసరమైన సహాయక పరికరాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్, ట్రైసైకిల్స్ వంటి పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు.

అరకులోయ మండల పరిధిలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ట్రైబల్ డిసబుల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పరికరాలను అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, సంఘ సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# ఆర్వి నగర్ ఆసుపత్రి పరిశీలించిన ఎంపీడీవో

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 10:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం ఆర్వి నగర్ గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపీడీవో బిహెచ్వి రమణబాబు మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న సౌకర్యాలు, నిర్వహణ పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వైద్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో బెడ్ల సంఖ్యను పెంచాలని, సమావేశ మందిరం మరియు ప్రహరీ నిర్మించాలని కోరారు. గ్రామంలో కలుషిత నీరు త్రాగడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటూ, ఆసుపత్రిలో మంచినీటి సదుపాయం కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.సిబ్బంది తెలిపిన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. అనంతరం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశమై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు గ్రామ స్థాయికి సమర్థంగా చేరేలా పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## కురుపాం కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కురుపాం, పెన్ పవర్, మార్చి 10 :**కురుపాం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి )లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ. కిరణ్ కుమారి తెలిపారు.

ప్రవేశాల వివరాలు:

6వ తరగతి: మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఇంటర్మీడియట్ (ఫ్రీజ): మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయి.ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 12వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను అధికారిక వెబ్సైట్ ష్ట్రజూం://ఖజూన్రఎజ.ఖజూఎటం౦.అఅ/ ద్వారా సమర్పించాలని ఆమె సూచించారు. ఇతర వివరాలకు కేజీబీవీ కి సంప్రదించవచ్చు, అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్,ఐ. కిరణ్ కుమారి కోరారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజీ దూకుడు

- వరుసగా 16వ సారి ఓవరాల్ ఛాంపియన్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 10 :**రాష్ట్రస్థాయి మెడికల్ మరియు డెంటల్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో విశాఖపట్నానికి చెందిన ఆంధ్ర మెడికల్ కాలేజీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ వేదికగా డాక్టర్ ఎన్.టి.ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఏపీ రాష్ట్రస్థాయి మెడికల్ & డెంటల్ కాలేజీల అథ్లెటిక్స్ మీట్ 202526"లో ఏఎంసీ విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో వరుసగా 16వ సారి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 కళాశాలల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ ప్రతిభ కనబరిచి అగ్రస్థానంలో నిలిచారు.

పురుషుల విభాగంలో 66 పాయింట్లతో మెన్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన ఏఎంసీ జట్టు, మహిళల విభాగంలో 48 పాయింట్లతో ఉమెన్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను గెలుచు కుంది. ఈ విధంగా మొత్తం 114 పాయింట్లు సాధించి పురుషులు, మహిళల విభాగాల్లో కలి పి ఓవరాల్ విజేతగా నిలిచింది. వరుసగా 16వ సారి ఈ ప్రతిష్టాత్మక ఛాంపియన్ షిప్ సాధించ డం ప్రత్యేక రికార్డుగా నిలిచింది.

ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. ఎస్.ఎం. సంధ్యాదేవి, లేడీస్ హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డాక్టర్ సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు విజేతలను అభినందిం చారు. పురుషుల జట్టు కెప్టెన్ జి. నేతాజీ, మహి ళల జట్టు కెప్టెన్ వై. తోషితతో పాటు మొత్తం జట్టు సభ్యుల సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా క్రీడల్లో ఆంధ్ర మెడికల్ కాలేజీ మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

## ఉద్యోగాల పేరుతో లక్షలు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య గౌరవ అధ్యక్షులు జల్లి రాజబాబు డిమాండ్.




**పాడేరు , పెన్ పవర్, మార్చ్ 10:** నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఆశ్రమ పాఠశాలలలో సెక్యూరిటీ అటెండర్ ఉద్యోగాలు ఇస్తామని, శ్రీ రక్ష అనే మేన్ పవర్ ఏజెన్సీ కంపెనీ పేరుతో, కొంతమంది ఆదివాసి నిరుద్యోగ యువత దగ్గర 70 వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు భారీ అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, గిరిజన సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు జల్లి రాజబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు వారు మాట్లాడుతూ: గిరిజన ప్రాంతాల్లోని అమాయక నిరుద్యోగులే లక్ష్యంగా అక్రమార్కులు రెచ్చిపోతు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 'శ్రీ రక్ష' అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ పేరుతో కొందరు వ్యక్తులు భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళితే అల్లూరి సీతారామ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని, త్వరలో భర్తీ చేయనున్నామని చెబుతూ కొంతమంది పాడేరు చెందిన వ్యక్తులు మోసానికి పాలు పడ్డారు . నిరుద్యోగులైన గిరిజన యువతకు మాయమాటలు చెప్పడంతో, వారి మాటలు నమ్మి భూములు, ఆస్తులు, బంగారాలు, అమ్మి నగదు పోగొట్టుకొని . రోడ్డున పడ్డారని అక్రమార్కులు ఒక్కొక్కరి నుంచి రూ.70 వేల నుంచి లక్ష రూపాయలు వరకు తీసుకొన్నారు నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మోసపోయిన నిరుద్యోగ యువతతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు అన్నారు.

## అనంతగిరిలో ఉపాధి హామీ పథకం పనుల సోషల్ ఆడిట్



**ఆనంత గిరి పెన్ పవర్ మార్చి 10** మండలంలో గురువారం ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. అనంతగిరి మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలో 2025-2026 ఆర్థిక సంవత్సరంలో 3932 అభివృద్ధి పనులు చేపట్టి 32కోట్ల 46లక్షల 81వేలు రూపాయలను పనులు చేసి ఖర్చు చేపట్టడం జరిగిందని సామాజిక తనిఖీ బృందం సభలో చదివి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దీసరి గంగరాజు, ఎంపీపీ మితుల డ్వామా పిడి విద్యాసాగర్, ఏపిడి పవన్, ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సామాజిక బృందం, విజిలెన్స్ అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


## వైకాపా16వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి.

**వైకాపా ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన మండల అధ్యక్షుడు గణబాబు.**



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 10.** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి గణబాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2011లో ఆవిర్భవించి మార్చి 12 నాటికి 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ ఏట అడుగుపెడుతుందన్నారు. గడచిన 15 ఏళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలతో మమేకమై నిత్యం ప్రజలతో ఉందన్నారు. ఈ క్రమంలో 2014 ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో పార్టీ 67 స్థానాలను గెలుచు కుందన్నారు. అదేవిధంగా 2019 శాసనసభ ఎన్నికలలో 151 స్థానాలను గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమాన్ని చేరవేసిన ప్రభుత్వం వైకాపా అన్నారు. అమ్మ ఒడి మొదలు నవరత్నాలు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, పింఛన్లు, రైతు భరోసా, వైయస్సార్ చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, వాలంటరీ వ్యవస్థ, గ్రామ సచివాలయ వ్యవస్థ లను తీసుకురావడం ద్వారా ప్రజల వద్దకే పరిపాలనను చేరవేసిన ప్రభుత్వం వైకాపా అన్నారు. ఇటువంటి ప్రజా సంక్షేమ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి వైకాపా ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 145వ జాతరలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 10 :**నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం మం డలం పోలిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ పైడి తల్లి అమ్మవారి 145వ వార్షిక జాతర మహో త్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరి గింది. ఈ ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ఆహ్వా నం మేరకు నెల్లిమర్ల మాజీ శాసనసభ్యులు బ డ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఆయన సతీమణి పద్మావతి, వారి రెండవ కుమారుడు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నెల్లిమర్ల ని యోజకవర్గ అధ్యక్షుడు ప్రదీప్ నాయుడు, కోడ లు చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ జాతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఉత్సవ కమిటీ సభ్యులు, స్థా నిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికా రు.ఈ సందర్భంగా వారు పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యే క పూజలు నిర్వహించారు. అనంతరం పండితు ల ఆశీర్వాదం పొందారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ము ఖ్య నాయకులు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ.






**చింతపల్లి పెన్ పవర్ మార్చి 10.** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం విజయభారతి ఆవిష్కరించారు. మంగళవారం చింతపల్లి డిగ్రీ కళాశాలలో విగ్రహ ఆవిష్కరణ గావించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మహనీయుడు పేదల పాలిట పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశయాలను ఆదర్శాలను లక్ష్యాలను ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. చదువు ద్వారానే సమాజ స్థితిగతులను మార్చవచ్చునని అంబేద్కర్ చైతన్యపరిచారన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యలను అభ్యసించడానికి సన్నద్ధం కావాలని, అప్పుడే జీవితాలలో నిజమైన మార్పు, ఎదుగుదల ఉంటుందన్నారు. విగ్రహ దాత చల్లంగి కృష్ణ కాంత్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అంబేద్కర్ చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల పాత్రుడు, డాక్టర్ వి రమణ, పి. లీలా పావని, డాక్టర్ డి. కే జి య, కే .సంతోషి, ఐ. నాయక్, తాంగుల జగత్ రాయి మరియు ఇతర అధ్యాపక అధ్యాపకేతర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బారి నుండి రక్షించుకునేందుకు హెచ్.పి.వి టీక తప్పనిసరి.

- తాడికొండ పీహెచ్‌సీలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభించిన ప్రభుత్వ విప్.తాయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం మార్చి 10 పెన్ పవర్:**మండలం తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను గర్భాశయ ముఖ కేన్సర్ నుండి రక్షించేందుకు హెచ్‌పీవీ టీకా అందజేస్తున్నట్లు తెలిపారు.14 సంవత్సరాలు పూర్తి చేసి 15 సంవత్సరాలు పూర్తి కాని బాలికలకు ఈ టీకా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.టీకా ఇచ్చిన అనంతరం ప్రతి బాలికను కనీసం 30 నిమిషాల పాటు పరిశీలనలో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.టీకా తీసుకున్న తరువాత ఇంజక్షన్ ఇచ్చిన చోట నొప్పి,ఎర్రదనం,వాపు లేదా తేలికపాటి జ్వరం వంటి లక్షణాలు కనిపించవచ్చని,ఇవి సాధారణంగా రెండు నుంచి మూడు రోజుల్లో తగ్గిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యులు యం బుద్దేశ్వరరావు,పి అభిలాష్,వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి,నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి,హెచ్.వి వి సింహాచలం,పి భారతి,వైద్య సిబ్బంది,ఆరోగ్య కార్యకర్తలు,స్థానిక కూటమి ప్రజాప్రతినిధులు మరియు బాలికలు,తదితరులు పాల్గొన్నారు.

## చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని ప్రారంభించిన -ఎంపీపీ కోరాబు అనుష దేవి.






**చింతపల్లి పెన్ పవర్ మార్చి 10.**అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, కిటుముల పంచాయితీ కేంద్రంలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం (ఎస్ డబ్ల్యు పి సి). మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోరాబు అనూష దేవి మంగళవారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ గెమ్మెలి రమణమ్మ ఆధ్వర్యంలో ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సంపద సృష్టి కేంద్రం ద్వారా గ్రామస్తులకు వివిధ రకాలైనటువంటి ప్రయోజనాలు ఉన్నాయి అన్నారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తడి పొడి చెత్తలుగా వేరుచేసి ఇంటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందిస్తే వారి ద్వారా వర్మి కంపోస్ట్ వంటివి తయారు చేయుచున్నారు. దీని ద్వారా రైతులు పంటలు పండించుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. సాధారణంగా గిరిజన ప్రాంత రైతులంతా ప్రకృతి సేద్యం పై ఆధారపడి ప్రకృతి సాధ్యం చేయబడడానికి ఇష్టపడతారని అటువంటి వారికి వర్మి కంపోస్టు సేద్యానికి ఉపయోగించడం ద్వారా పంటలు కూడా బాగాపండి అధిక దిగుబడి వస్తుందన్నారు. సంపద సృష్టి కేంద్రం ద్వారా అన్ని రకాల సేవలు అందించాలంటే ప్రజలు వారి యొక్క సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇందులో ప్రధానంగా పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని చెప్పారు. ప్రజలందరికి ఉపయోగపడే సంపద సృష్టి కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సభ్యునిగా చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనము పద్మ కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'బలమైన' హామీ సాకారానికి లోకేష్ భూమి పూజ!

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇక్కడి నదీతీర ప్రాంతం వాసుల సమస్యలు పరిష్కరించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి తాజాగా భూమి పూజ చేయడం గమనార్హం. తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయడంతో స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ రక్షణ గోడ నిర్మాణానికి 294 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు. మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండున్నర కిలో మీటర్ల మేరకు కృష్ణా నది కుడివైపున ఈ వరద రక్షణ గోడను నిర్మించనున్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేసినట్టు అయింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే 294 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు.

**బలమైన కట్టడం!**

కేవలం సాధారణ గోడగా కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50 వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇరాన్-ఇజ్రాయిల్ వార్ : ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంచాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు. మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హార్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్దత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్ధత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని, నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జిల భారం తడిపిమోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హీరో శివాజీ.. అవసరమా ఈ మాటలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** స్క్రిప్ట్ ప్రకారం అయితే ఆయనకు ఇప్పుడు కావాల్సింది మంచి పాత్రలు, హిట్ సినిమాలు... కానీ కెమెరా ముందు నటన కన్నా కెమెరా వెనుక రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లున్నారు నటుడు శివాజీ. సినిమాలో విలన్‌ని ఎదుర్కోవడం ఎంత బాగుంటుందో రాజకీయాల్లోకి వెళ్లకుండానే విలనిజాన్ని ఎంచుకోవడం అంతకంటే రిస్క్ అని ఈయన ఎప్పుడు గుర్తిస్తారో! తెలుగు సినీ పరిశ్రమలో తనదైన శైలి నటనతో సహజమైన డైలాగ్ డెలివరీతో ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ. సుదీర్ఘ విరామం తర్వాత 'బిగ్ బాస్' వంటి కార్యక్రమాల ద్వారా మళ్లీ పాపులర్ అయిన ఆయన ఇప్పుడు సినిమాల్లో కూడా బిజీ అవుతున్నారు. అయితే ఒక నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న శివాజీ.. ప్రస్తుతం తెరపై కంటే తెర వెనుక రాజకీయ చర్చల వల్లనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఆయన చేస్తున్న సంచలన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన చేస్తున్న విమర్శలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.

**రాజకీయ నిష్పాక్షపాతం.. ఆచరణలో ప్రశ్నార్థకం?**

శివాజీ తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని.. తనకు ఏ పార్టీతోనూ అంటకాగాల్సిన అవసరం లేదని పదే పదే చెబుతుంటారు. కానీ ఆయన మాటలు మాత్రం పరోక్షంగా ఒక నిర్దిష్ట రాజకీయ పక్షానికి... అంటే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నాయనే భావన రాజకీయ పరిశీలకుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఒక నటుడిగా ప్రజా సమస్యల మీద స్పందించడం తప్పు కాదు... కానీ తన మాటలు రాజకీయంగా ఒక పక్షానికి అనుకూలంగా, మరొక పక్షానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆయన 'నిష్పాక్షపాతం'పై అనుమానాలు మొదలయ్యాయి. ఒకరిని విమర్శించడం, సవాళ్లు విసరడం వంటివి ఆయన ఇమేజ్‌ను ఒక 'పొలిటికల్ యాక్టివిస్ట్' స్థాయికి తీసుకువెళ్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండో ఇన్నింగ్స్.. సినిమాలపైనే దృష్టి పెట్టాల్సిన సమయం**

ప్రస్తుతం శివాజీకి నటుడిగా మంచి అవకాశాలు వస్తున్నాయి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కీలక పాత్రల్లో ఆయన తన ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రేక్షకుల్లో కూడా ఆయనపై ఒక సానుకూల దృక్పథం పెరుగుతోంది. ఇలాంటి కీలక తరుణంలో సినిమాలపై, తన నటనపై పూర్తి దృష్టి పెట్టాల్సిన శివాజీ అనవసరమైన రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల కలిగే లాభం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. రాజకీయ వ్యాఖ్యల వల్ల ఆయనకు లభించే క్రేజ్ తాత్కాలికం కావచ్చు కానీ ఒక నటుడిగా ఆయనకు వచ్చే గుర్తింపు చిరస్థాయిగా ఉంటుంది. వివాదాలు నటుడిని నటుడిగా కాకుండా ఒక వర్గానికి ప్రతినిధిగా చూసే ప్రమాదం ఉంది. ఇది ఆయన సినీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా హోరు..వాస్తవ పరిస్థితి ఏమిటి?**

నేటి కాలంలో సోషల్ మీడియాలో ఏ చిన్న వ్యాఖ్య చేసినా దానికి అనంతమైన ప్రతిస్పందనలు వస్తుంటాయి. శివాజీ రాజకీయ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో కొన్ని వర్గాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అయితే ఈ మద్దతు ఇచ్చేది నిజమైన అభిమానులా లేక రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వర్గాలా అన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇలా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు, రెచ్చగొట్టుకోవడం వల్ల సామాజికంగా లేదా రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం చేకూరదని చివరికి ప్రత్యర్థులకు అనవసరమైన పబ్లిసిటీని కట్టబెట్టడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కెరీర్‌పైనే మక్కువ చూపితేనే మంచిది!**

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. అయితే ఒక బాధ్యతాయుతమైన నటుడిగా, లక్షలాది మంది అభిమానులు ఉన్న వ్యక్తిగా శివాజీ తన వ్యాఖ్యల వల్ల కలిగే పరిణామాలను ఆలోచించుకోవాలి. రాజకీయాల్లోకి వెళ్లకపోయినా రాజకీయ వ్యాఖ్యలు చేయడం వల్ల వచ్చే వివాదాలు కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉండి.. తన నటనతో ప్రేక్షకులను అలరించడంపైనే దృష్టి సారిస్తే బాగుంటుందనేది మెజారిటీ అభిమానుల ఆకాంక్ష. నటుడిగా ఆయనకు ఉన్న సహజమైన ప్రతిభ, ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ ఆయనకు మంచి భవిష్యత్తును అందిస్తాయి. శివాజీ తన కెరీర్ పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరి ఆశ.

# ఇది ఏపీ పోలీసు రివేంజ్? బిహార్ లో దెబ్బకు రిటర్న్ గిఫ్ట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైకోర్టు సూచనల ప్రకారం సునీల్ నాయక్ ను గత ఐదు రోజులుగా విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు అధికారుల బృందం విచారిస్తోంది. అంతేకాకుండా విచారణను మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో బిహార్ లో ఎదురైన అవమానానికి రివేంజ్ తీర్చుకునేలా, రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా సిట్ పోలీసులు సునీల్ నాయక్ విచారణను కొనసాగిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ లో సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు వెళ్లిన ఏపీ పోలీసు బృందానికి అక్కడ హోంగార్డులు ఇబ్బందులు సృష్టించారని, ఘర్షణ వైఖరి అవలంబించి కస్టడీలో ఉన్న సునీల్ నాయక్ ను తమతో తీసుకువెళ్లిపోయారని చెబుతున్నారు. అంతేకాకుండా ఓ మహిళా అధికారి ఇష్టానుసారం తిట్టారన్న ప్రచారం జరిగింది. దీనిపై రివేంజ్ తీర్చుకునేలా ప్రస్తుతం సునీల్ నాయక్ విచారణ కొనసాగుతోందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణను పరిశీలిస్తే గతంలో సిట్ అధికారులు ఎదుర్కొన్న పరాభవానికి ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సునీల్ నాయక్ ను అరెస్టు చేయాలనే పట్టుదల పోలీసు అధికారుల్లో కనిపిస్తోందని, అందుకే బెయిలు తీర్పు వచ్చే వరకు విచారణను పొడిగిస్తూ వస్తున్నారని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రఘురామరాజు అరెస్టు సమయంలో సునీల్ నాయక్ డీఐజీగా ఉన్నారు. అప్పట్లో ఏం జరిగింది? సునీల్ నాయక్ కు ఏం తెలుసు అన్న విషయాలపై సుదీర్ఘంగా విచారణ జరుగుతోంది. అయితే ఇదే కేసులో నిందితుడు అయిన మరో సీనియర్ అధికారి పీ.వీ.సునీల్ కుమార్ ను



కేవలం ఒక రోజు, అది కూడా కేవలం నాలుగు గంటల పాటు విచారించి వదిలేశారని గుర్తు చేస్తున్నారు. కానీ ఐపీఎస్ సునీల్ నాయక్ విషయంలో మాత్రం సిట్ పోలీసులు రోజుల తరబడి విచారణ కొనసాగించడమే ఇంట్రెస్టింగు డిస్కషన్ కు తెరతీస్తోంది. ఆయన వ్యవహారశైలిపై ఏపీ పోలీసు అధికారులు గుర్రుగా ఉన్నారని, అందుకే విచారణను సుదీర్ఘంగా కొనసాగిస్తూ తమ చుట్టూ సునీల్ నాయక్ తిరిగేలా చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిహార్ రాజధాని పట్నాలో సునీల్ నాయక్ ను గతంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే నిబంధనలను చూపి ట్రాన్సిట్ వారెంట్ జారీ కాకుండా అక్కడి పోలీసులు సునీల్ నాయక్ ను ఏపీ తరలించకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ఏపీ పోలీసులపై ఎదురు కేసులు పెట్టడం, ఒకానొక సమయంలో దాడికి ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. దీనిని స్థానిక కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు సునీల్ నాయక్ ను విచారించేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఆయన రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు సీసీఎస్ పోలీసుస్టేషన్ లో విచారణకు హాజరవుతున్నారు. తొలుత 9వ తేదీవరకు సునీల్ నాయక్ విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో మరో మూడు రోజులు సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు సూచించింది. దీంతో ఈ నెల 12వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని చెబుతున్నారు. ఇదంతా పరిశీలిస్తే గతంలో విచారణకు హాజరుకాకపోవడం, బిహార్ లో తమకు సహకరించకపోవడాన్ని సిట్ పోలీసులు సీరియస్ గా తీసుకున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే సీనియర్ అధికారిని విచారణ పేరుతో రోజూ తమ వద్దకు రప్పించుకుంటున్నారని అంటున్నారు. సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై హైకోర్టు తీర్పు వచ్చేవరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై తీర్పు వచ్చిన తర్వాత అరెస్టు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుని విచారణ ముగిస్తారని అంటున్నారు. దీంతో మరో రెండు రోజులు కూడా సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని, 12వ తేదీన హైకోర్టు ఆదేశాలతో ఈ పరిస్థితిలో మార్పు రావొచ్చని అంటున్నారు.

# పశ్చిమ ప్రకాశం లో వైసీపీ వీక్ అయిందా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి భారీ ఓటమి బాధలు ఇంకా తీరలేదా అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పార్టీకి కీలకమైన జిల్లాలలో ఇంకా కోలుకోకపోవడమే అని అంటున్నారు. ఇక జగన్ అంటేనే పశ్చిమ ప్రకాశంగా చెబుతారు. అలాగే పశ్చిమ ప్రకాశం అంటే జగన్ అనే విధంగా అక్కడ రాజకీయం ఉంటుంది. అలాంటి పశ్చిమ ప్రకాశంలో ఇపుడు వైసీపీ రాజకీయాలు భిన్నంగా సాగుతున్నాయని అంటున్నారు. పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా మారింది. మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఇక ఇందులో మూడు జనరల్ ఓసీ అయితే ఒకటి ఎస్సీగా ఉంది. అదే ఎర్రగొండపాలెం. ఇక మిగిలినవి చూస్తే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిగా ఉన్నాయి.

**వారిదే డామినేషన్ :**

ఇక చూస్తే పశ్చిమ ప్రకాశంలో రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్ అంటారు. అంటే జనాభా పరంగా వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ జగన్ అమలు చేస్తున్న స్ట్రాటజీ అయితే ఏ మాత్రం వర్కౌట్ కావడంలేదు అని అంటున్నారు. కనిగిరిలో పూర్తిగా రెడ్లు ఉంటారు. కానీ అక్కడ సీటు యాదవ సామాజిక వర్గానికి జగన్ ఇచ్చారు. టీడీపీ తరఫున రెడ్డి అభ్యర్ధి ఉన్నారు. దాంతో సామాజిక వర్గం సమీకరణలతో రెడ్డికే అంతా జై కొట్టారు. అయితే ఇక్కడ యాదవ సామాజిక వర్గం కూడా మూడవ ప్లేస్ లో ఉంది. అయితే ఇక్కడ ఓటర్లలో కానీ మార్కాపుపురంలో కానీ పూర్తిగా రెడ్లే ఉంటారు. అలాగే అక్కడ వైశ్య సామాజిక వర్గానికి సీటు ఇస్తే టీడీపీ రెడ్లకు ఇచ్చింది. దాంతో అక్కడ కూడా వైసీపీ వ్యూహమేదీ వర్కౌట్ కాలేదని చెబుతారు

**సీన్ మొత్తం అంతే :**

ఇక చూస్తే గిద్దలూరులో నాన్ లోకల్ ని వైసీపీ హైకమాండ్ ఇంచార్జి ఇచ్చారు. కానీ రెడ్డి సామాజిక వర్గమంతా సబ్ క్యాస్ట్ ఆ అభ్యర్ధికి లేవు. కానీ అక్కడ అంతా సబ్ క్యాస్ట్ కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అలా గిద్దలూర్లో అయితే ఆ పార్టీ ఇంచార్జి అసలు గ్రామ కమిటీలు కూడా వేయలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఇంకా చాలా గ్రామాలు ఖాళీగా ఏ కమిటీలు లేకుండా ఉన్నాయని అంటున్నారు. ఇక ఆయన ఉండేది మార్కాపురంలో గిద్దలూరుకి చుట్టపు చూపుగా వస్తూ పోతూ ఉన్నారు అంటున్నారు. దాంతో గిద్దలూరులోని వైసీపీ క్యాడర్ అయితే ఇంచార్జిని నమ్మడం లేదని అంటున్నారు. దాంతో ఆయనకే 2029లో టికెట్ వస్తుందా లేదా అన్నది కూడా చాలా మంది అనుకుంటున్న నేపథ్యం ఉంది.

**పార్టీలోనే వ్యతిరేకత :**

ఇక మార్కాపురంలో అయితే ఇంచార్జికి గ్రామంలో ఉన్న



రెడ్డి సామాజిక వర్గం నాయకులకు అసలు సపోర్టు చేయడం లేదని అంటున్నారు. ఎందుకంటే గతంలో ఆ ఇంచార్జికి అక్కడి రెడ్డి సామాజిక వర్గం నేతలకు పడడం లేదని భావించే గిద్దలూరు నుంచి వచ్చి మార్కాపురంలో పోటీ చేశారు అని గుర్తు చేస్తున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారి వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వవద్దని అని బహిరంగానే వైసీపీ నేతలు చెబుతున్నారని టాక్ నడుస్తోంది. దాంతో అక్కడ కూడా చాలా ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.

**కనిగిరిలోనూ ఇబ్బందిగానే :**

ఇక కనిగిరి నియోజకవర్గంలో అయితే గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వారి వర్గీయులు ప్రస్తుతం ఇంచార్జికి ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు, పైగా బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంచార్జి తీరు పట్ల అక్కడ రెడ్డి సామాజిక వర్గం గుర్రుగా ఉనంటున్నారు అని చెబుతున్నారు. ఇక కనిగిరి ఇంచార్జికి డబ్బులు సమస్యగా ఉంది అని అంటున్నారు. ఇదే విషయం పెద్ద ఎత్తున డిస్కషన్ గా ఉంది. కనిగిరి ఒక్కటే కాదు మార్కాపురం, గిద్దలూరు ఇంచార్జిలు కూడా డబ్బులు తీయడం లేదు అని పార్టీలోనే కామెంట్స్ ఉన్నాయి.

**ఈయన ఒక్కడే బెస్ట్ :**

ఇక యెర్రగుండపాలెం ఎస్సీ ఎమ్మెల్యే మాత్రం బెస్ట్ అని అంటున్నారు. ఆయన అందరికీ నియోజకవర్గంలో కలుపుకుని పోతున్నారు అని చెబుతున్నారు. అందరితో మంచి సంబంధాలు నెరుపుతున్నారు అని నియోజకవర్గం క్యాడర్ ఎబుతోంది. ఇక వైసీపీ హైకమాండ్ కి ఆయన మీద మంచి నివేదికలు వెళ్ళాయని అంటున్నారు అలా యెర్రగొండపాలెం ఎమ్మెల్యేకు జగన్ దగ్గర మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. దాంతో అతనికి ఏ ఇబ్బంది ఉండదని వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని అంటున్నారు.

**మూడు సీట్లూ ఫోకస్ పెట్టాల్సిందే :**

అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లలో మూడు అసెంబ్లీ సీట్ల మీద వైసీపీ అధినాయకత్వం ఫోకస్ పెట్టాల్సిందే అని అంటున్నారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరూ ఈ మూడు సీట్లను బలమైన రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు ఇంచార్జిలుగా ఉన్న వారు జనంతో ఉండాలని క్యాడర్ ని కలుపుకుని పోవాలని డబ్బులు ఖర్చు పెట్టాలని కోరుతున్నారు. లేకపోతే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఈ ముగ్గురు ఇంచార్జిల పనితీరు మీద గుర్రుగా ఉన్న క్యాడర్ అయితే వారిని మార్చాలని తామే హైకమాండ్ ని కోరుతామని కూడా అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నియోజకవర్గాలలో కనుక మార్పులు చేసి బలమైన రెడ్లని ఇంచార్జులుగా నియమిస్తే వైసీపీకి తిరుగు ఉండదని అంటున్నారు. దాంతో మార్కాపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లను వైసీపీ గెలుచుకుని తీరుతుందని వైసీపీ అంటున్నారు. మరి హై కమాండ్ ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంతా చర్చిన్ చర్చించుకుంటున్నారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్షదీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్షదీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్షదీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్షదీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్షదీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్షదీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్షదీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్దలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

## రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. "ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా" అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు. ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. "మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది" అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. "2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది" అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. "మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది" అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.


ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. "2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... "ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం" అని సూర్య తెలిపాడు. వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.

# 'బేబీ' జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?

టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటా.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.



ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.



సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**

అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచుర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి. ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965